క్లుప్తంగా

తిమ్మసముద్రంలో గ్రామసభ రేపు

రామకుప్పం: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మసముద్రంలో శనివారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా 26 తేదీన చెన్నారెడ్లపల్లి, 27న రామకుప్పంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు గ్రామసభలో అర్జీ రూపంలో అధికారులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా భూరీసర్వే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలి


సూచనలిస్తున్న ఏడీ శ్రీనివాసులనాయుడు

సదుం: మినీ గోకులాల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసులనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మినీ గోకులాలు మంజూరైన లబ్ధిదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. నిర్మాణాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఉపాధి, పశుసంవర్థక సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

సమస్యలు లేని మండలంగా కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: ప్రజలకు ఎటువంటి సమస్యలొచ్చినా వెంటనే పరిష్కరిస్తూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామని ఎంపీపీ యువరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపతినిధులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 25 తేదీన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో కరెంట్ పోల్స్ లేవని కమిటీ సభ్యులు తెలపడంతో వెంటనే ఎంపీపీ మండల ఏఈతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

పుంగనూరు: తమిళ కార్తీకమాసం సందర్భంగా ప్రసిద్ధ శైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, శ్రీకాళహస్తి, కర్ణాటక రాష్ట్రంలోని కోటిలింగాలకు వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. యాత్రికులు ఆన్‌లైన్, బస్టాండ్‌లోని టికెట్ల కేంద్రం వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వే పనుల తనిఖీ


వీరప్పల్లిలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు, వీరప్పల్లి పంచాయతీలలో జరుగుతున్న ఎన్సీఏ రిజిస్ట్రేషన్, వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పనులను ఎంపీడీఓ బాలాజి గురువారం తనిఖీ చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. సర్వేలను పారదర్శకంగా చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అంజప్ప, రాజేష్ పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చిన్నతనం నుంచే విద్యతో పాటు విలువలు ముఖ్యమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు అన్నారు. నగరంలోని జైహింద్, ఖాజీ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు నీతి పద్యాల పుస్తకాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలువలు లేని విద్య నిరుపయోగమని అన్నారు. నీతి కథలు, నీతి పద్యాలు బాల్యాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలోపు వందకు పైగా పద్యాలు నేర్చుకున్న పిల్లలకు బహుమతులు అందిస్తామని ఈసందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు నీతిపద్యాల పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కల్పన, టీచర్లు ముక్తియార్, చంద్రశేఖర్, మహబూబ్‌భాషా, తనూజ, సరిత పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలకు సమాధి

- వంచించిన కూటమి ప్రభుత్వం
- వలంటీర్లను కొనసాగించలేమన్న మంత్రి బాలవీరాంజనేయులు
- వలంటీర్ల వ్యవస్థకు మంగళం
- రూ.10వేలు ఇస్తామన్న బాబు.. మడమ తిప్పేసిన వైనం


ఇంటి వద్దనే పింఛన్ ఇస్తున్న వలంటీర్(ఫైల్)

పలమనేరు: ప్రతినెలా ఒకటో తేదీన పొద్దుపొడవక ముందే పింఛన్‌దారులకు పింఛన్ బట్వాడా, అన్ని సంక్షేమ ఫలాలు గడప వద్దకే తెచ్చి సేవలందించిన వారు వలంటీర్లు. కోవిడ్ సమయంలో సొంతవాళ్లే కుటుంబీకులను పట్టించుకోని పరిస్థితుల్లో తాము న్నామంటూ సేవలందించిన ఘనత వలంటీర్లది. గత ఎన్నికలప్పుడు చంద్రబాబు, వారి నాయకులు మాట్లాడుతూ వలంటీర్లు చేస్తున్న సేవలకు రూ.5వేల గౌరవవేతనం ఏం సరిపోతుందని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలకు రూ.10 వేలు ఇస్తామంటూ తీపి మాటలు చెప్పారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా తమకిచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకుంటాడని వలంటీర్లు ఆశగా ఎదురుచూశారు. కానీ మండలి సమావేశాల్లో ప్రతిపక్షనేత బొత్సా సత్యనారాయణ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయులు వలంటీర్లను తమ ప్రభుత్వం కొనసాగించడం లేదని స్పష్టం చేశారు. వీరిని గత ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందని, ఈ ప్రభుత్వం వీరిని కొనసాగించాలనే జీఓ ఇవ్వనందున వీరికి కొనసాగించడం అసాధ్యమని తేల్చి చెప్పేశారు. దీంతో ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీ నీటిమూటేనని మళ్లీ మరోసారి తేలతెల్లమైంది. ఎప్పటికైనా తమను వలంటీర్లుగా కొనసాగించకపోతారా అనే ఊహల్లో ఉన్న వలంటీర్ల ఆశలు అడిఆశలుగా మారాయి. మొత్తంమీద వలంటీర్ల విలువ ఇప్పుడు జనానికి బాగా అర్థమైంది. నాడు కోవిడ్ కష్టకాలంలో వలంటీర్ల సేవలను టీడీపీ నేతలు తప్పుపట్టలేదు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వలంటీర్ల విషయంలో టీడీపీ చేసిన రాజకీయాన్ని జనం అసహ్యించుకుంటున్నారు.

వలంటీర్ల సేవలను మరువగలమా..

నియోజకవర్గంలోని 90 పంచాయతీలు 560 గ్రామాల్లో ప్రతినెలా ఒకటో తారీఖున పింఛన్లు ఠంచనుగా అందేవి. సచివాలయ పరిధిలోని అన్ని రకాల సేవలు వీరి ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే చేరేవి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వీరు అనుసంధానకర్తలుగా వ్యవహరించేవారు. ఎన్నికలకు ముందు వీరిని టీడీపీ నాయకుల వేధింపులు, వలంటీర్లను స్లీపర్‌సెల్స్, టెర్రరిస్టులని విమర్శించడం, సోషల్ మీడియాలో వలంటీర్లను అవమానపరిచారు. దీంతో మూడొందలమంది దాకా వలంటీర్లు రాజీనామా సైతం చేసేశారు. దీనిపై అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజీనామాలు చేయని వారికైనా తమ ప్రభుత్వంలో అవకాశం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు ఈ వ్యవస్థకే మంగళం పాడేశారు.

పలమనేరు నియోజకవర్గంలో వలంటీర్ల వివరాలు

మొత్తం మండలాలు	:	5
మొత్తం వలంటీర్లు	:	1,200
రాజీనామా చేసిన వారు	:	300
పుంగనూరు నియోజకవర్గం		
పుంగనూరు రూరల్	:	267
పుంగనూరు అర్బన్	:	236
చౌడేపల్లె	:	218
సోమల	:	236
సదుం	:	172
పులిచెర్ల	:	242
రొంపిచెర్ల	:	173
మొత్తం వలంటీర్లు	:	1,544

ఇచ్చిన మాట తప్పారు..



గతంలో ఎన్నికలప్పుడు ఇదే కూటమి ప్రభుత్వం వలంటీర్లను కొనసాగిస్తామని మాట ఇచ్చింది. ఇప్పుడేమో వీలు కాదంటున్నారు. ఇదెక్కడి న్యాయమో ప్రజలే గమనించాలి. ఎన్నికల్లో గెలవడానికి ఇన్ని హామీలు ఇచ్చి మాలాంటి వాళ్లకు మోసం చేయడం తగునా.
–సుధాకర్, వలంటీర్, గంద్రాజుపల్లి, గంగవరం మండలం

మరీ ఇంత అన్యాయమా..



నేను వలంటీర్‌గా పని చేస్తూ పేదలకు సంక్షేమ పథకాలను అందించే వాన్ని. గతంలో కూటమి నేతలు తమను టెర్రరిస్ట్‌లంటూ విమర్శించారు. ఈ మాటలపై కడుపు మండి వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశా. అయితే వలంటీర్లను కొనసాగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇప్పుడు మాట తప్పింది. అన్నీ ఆ దేవుడే చూసుకుంటాడు.
–ప్రవీణ్, నాగిరెడ్డిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

మాటి ఇచ్చి ఇప్పుడు కాదంటే ఎలా...



వలంటీర్ల వ్యవస్థను తొలగించం. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరికి నెలకు రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వీలు కాదని మంత్రి చెప్పడం పేపర్లో చూసి చాలా బాధపడ్డా. మాట ఇవ్వడం దేనికి ఆపై దాన్ని అమలు చేయకుండా పోవడం ఏంటో ప్రజలైనా ఆలోచించాలి.
–మురళి, వలంటీర్, బైరెడ్డిపల్లి మండలం

మాట ఇచ్చి మోసం చేశారు..



తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలకు రూ.10వేల జీతమంటూ చెప్పింది కూటమి నేతలే. ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించలేమంటూ మంత్రి చెప్పడం చూసి చాలా బాధేసింది. మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకోకుంటే ఎలా.
–ప్రకాష్, వలంటీర్, పత్రపల్లి, వి.కోట మండలం

మండలిలో మంత్రి తేల్చి చెప్పేశారు



మండలి సమావేశాల్లో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయులు స్పష్టంగా చెప్పాక మళ్లీ తమను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందనే నమ్మకం పోయింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటలు నీటి మూటలుగా మారాయి.
–శ్రీనివాసులు, బంగ్లాచేను, వి.కోట మండలం

వారాహి అమ్మవారి మహాయాగం రేపు

కుప్పం: పట్టణంలోని శివశక్తి కల్యాణ మండపంలో సాయిమాత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వారాహి అమ్మవారి మహాయాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్టు తిరుచానూరు వారిచే అమ్మవారి వారాహి యజ్ఞం నిర్వహిస్తున్నారు. శనివారం సాయంకాలం 6 గంటలకు ప్రారంభమయ్యే అమ్మవారి మహాయాగానికి పట్టణ ప్రజలు, అమ్మవారి భక్తుల పాల్గొనాలని నిర్వాహకులు జగదీష్‌బాబు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి


విత్తనాలను విత్తే కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు

సదుం: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్‌రెడ్డి సూచించారు. చెరుకువారిపల్లె రోడ్డు సమీపంలోని అటవీప్రాంతానికి ఎన్‌సీసీ, ఎన్‌జీసీ విద్యార్థులతో వెళ్లి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. ఈసందర్భంగా వివిధ రకాలకు చెందిన 50 కేజీల విత్తనాలను నాటామన్నారు. వీటిని లయన్స్‌క్లబ్ సభ్యులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కో–ఆర్డినేటర్ అమర్‌నాథ్, టీచర్లు రవీంద్రబాబు, ఆంజనేయులు, జిలానీబాషా, విశ్వనాథ్, యుగంధర్ పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘంచే ఈనెల 23న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి మునస్వామి మొదలియార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వారిచే వైద్యశిబిరం రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. కంటి సమస్యలు కలిగిన వారు వైద్యశిబిరంలో పాల్గొని, ఉచిత వైద్యసేవలు పొందాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం

- హాజరు కానున్న జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి


మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పలమనేరు పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద వెంకటసాయి ఫంక్షన్ హాలులో నేడు వైఎస్సార్‌సీపీ నియోజకర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎన్.వెంకటేగౌడ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి హాజరవుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండలాల కేడర్, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తూతూ మంత్రంగా వైద్యసేవలు


ఓపీ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు

- పట్టించుకోని వైద్యులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన జనం


సిబ్బంది లేక ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న ఓపీ

పుంగనూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. గంటల తరబడి వేచి ఉన్నా వైద్యసేవలు అందకపోవడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన గురువారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 50 మంది రోగులు ఉదయం నుంచి 12 గంటల వరకు వేచి ఉన్నా ఓపీ సిబ్బంది లేకపోవడంతో వైద్యులు సేవలు అందిచకపోవడంతో రోగులు విలవిలలాడారు. ఈవిషయమై డాక్టర్లు కూడా పట్టించుకోలేదని వాపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిలో తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపించారు. ఏరియా ఆస్పత్రిలో ఎవరు పనిచేయడం లేదని, కాలక్షేపాలతో, సెల్‌ఫోన్లు చూస్తూ కాలం గడిపేస్తున్నారని రోగులు మండిపడ్డారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారిని వివరణ కోరగా ఓపీ సిబ్బంది కొద్దిసేపు బయటకు వెళ్లారని, ఆ సమయంలో ఇలా ఆలస్యం జరిగిందన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వైద్యసేవలు అందించామన్నారు. ఓపీలో ఉన్న ఉద్యోగికి మెమో జారీ చేశామన్నారు.

ఈ-స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- కుప్పం సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణ

సాక్షి ఎఫెక్ట్..

కుప్పంరూరల్: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'ఈ-స్టాంప్‌లతో దోపిడీ' అనే వార్తకు కుప్పం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ-స్టాంపు వెండర్లు అధిక ధరలకు నాన్ జుడిషియల్ స్టాంపు పేపర్లు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మళ్లీ పునరావృతం అయితే స్టాక్ హోల్డింగ్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయలలో తగినంత నాన్ జుడిషియల్ పేపర్లు ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి స్థల సేకరణ

పుంగనూరు: మండలంలోని బండ్లపల్లి పంచాయతీ నల్లూరుపల్లిలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించినట్లు దళిత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శంకరప్ప తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్, వీఆర్ఓ. ఇతర రెవెన్యూ బృందంతో నల్లూరుపల్లిలో స్థలాన్ని సేకరించేందుకు వెళ్లారు. స్థలాన్ని గుర్తించి, గ్రామపెద్దలతో చర్చించి 22 అడుగుల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు కూడా అధికారులు గుర్తించిన స్థలంలో ఎటువంటి అభ్యంతరాలు లేవని, గ్రామస్తులు చిన్నరెడ్డెప్పరెడ్డి, అగిస్తప్ప, నారాయణ, జయమ్మ, మునిరత్నం తెలిపారు. దళిత సంఘ నేతలు ఎస్ఆర్.అశోక్, భాస్కర్ పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం


మాదనపల్లిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

పెద్దపంజాణి: ఉపాధి పథకం కింద మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని బట్టందొడ్డి, మాదనపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలానికి 175 గోకులం షెడ్లు మంజూరయ్యాయని అయితే 70 మాత్రమే గ్రౌండిగ్ అయ్యాయన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే రైతులను సంప్రదించి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉపాధి పనులు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పనులు పూర్తి చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి, ఏపీఓ మురుగేషన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆసక్తితోనే అన్వేషణ సాధ్యం


నమూనాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

శాంతిపురం: కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తితో విద్యార్థి స్థాయి నుంచి అన్వేషణ సాగితే భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని అగస్త్య ఫౌండేషన్ మ్యాథ్స్ హెడ్ డాక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. కూతేగానిపల్లి వద్ద ఉన్న శ్రీపరమహంస యోగానంద విద్యాలయలో గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ అండ్ మ్యాథ్స్ ఫెయిర్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలతోపాటు నిత్య జీవితంల అన్ని విషయాలు సైన్స్, మ్యాథ్స్‌తో ముడిపడి ఉంటాయన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను పరిశీలించి బహుమతులను అందజేశారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్, ఇగ్నేటర్ అనిత, వైస్ ప్రిన్సిపల్ పార్థువులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించి పౌష్టికాహార పదార్థాలను తీసుకోవాలని సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి, ఫెమి–9 సంస్థ ప్రతినిధి అనంత్ మునిరాజ్ అన్నారు. చిత్తూరు నగరం ఎస్టేట్‌లోని సీడీపీఓ కార్యాలయంలో హెల్తీ పీరియడ్స్ అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారం శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తోందన్నారు. వైద్యులు చెప్పే సూచనలు పాటించి ఆరోగ్యకరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గ్రామ స్వరాజ్యానికి తూట్లు


సిబ్బంది, అర్జీదారులు లేక వెలవెలబోతున్న బైరెడ్డిపల్లె-2 సచివాలయం


బైరెడ్డిపల్లెలో మీసేవా కేంద్రంలో జనసందోహం

- వెలవెలబోతున్న సచివాలయ కేంద్రాలు
- మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్న జనం
- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- పనిలేక ఖాళీగా ఉద్యోగులు

బైరెడ్డిపల్లి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు జగనన్న ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు, సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కుదేలు చేసిన సర్కార్, సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు పథకం పన్నింది. జగనన్న పాలనలో సచివాలయాల ద్వారా 545 సేవలు అందేవి. సచివాలయ ఉద్యోగులు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్కువ ధరలకు అన్ని సర్టిఫికెట్లను ఇచ్చేవారు. దీంతో రైతులు ఎంతో ఆనందపడేవారు. ఏ పథకం వర్తించాలన్నా.. ఏపని పూర్తి కావాలన్నా సంబంధిత సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్తే క్షణాల్లో పని జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు వెలవెలబోతున్నాయి. సిబ్బంది ఉన్నా సాంకేతిక కారణాలు, విద్యుత్ సమస్య, సర్టిఫికెట్లు లేకపోవడంతో ఏ పని లేకుండా ఉద్యోగులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కార్డుసేవలు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వంటి వెబ్‌సైట్లు ఇంతవరకు ఓపెన్ కాలేదు. ఫలితంగా అనేక మంది దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు.

మీసేవా కేంద్రాలు కిటకిట


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో నామమాత్రంగా సేవలు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బందిని ఇతర పనులకు వినియోగిస్తుండడంతో సచివాలయంలో సిబ్బంది కూడా అంతంతమాత్రంగా ఉంటారనే ఆరోపణలు ఉన్నాయి. సచివాలయాలకు వెళ్తున్న సామాన్య ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ప్రజలకు అత్యవసరమైన ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వం అపార్ కార్యక్రమంలో అప్‌డేట్ చేస్తుండడం, విద్యార్థుల ఆధార్, స్కూల్ రికార్డుల్లోని వివరాల్లో తేడాలు ఉండడంతో వాటిని సరిచేసేందుకు తల్లితండ్రులు దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. దీంతో మీ సేవా కేంద్రాలు కిటకిటలాడుతూ ఎప్పుడూ జనసందోహంతో కనిపిస్తున్నాయి.

అన్ని సేవలూ అందించాలి..



గతంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అందించిన అన్ని సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అందించాలి. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత సంక్షేమ పథకాల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసే బాధలు తప్పాయి. అర్హత ఉండి సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందించారు. దీని వల్ల పేదలు లబ్ధిపొందారు.
–కేశవులు, తీర్థం

పటిష్టం చేయాలి..



గతంలో మాదిరిగా గ్రామ, వార్డు, సచివాలయాలను పటిష్టం చేయాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అన్ని రకాల సేవలను యథావిధిగా కొనసాగించాలి. ప్రజల వద్దకే పాలన, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలి. ఇటీవల సచివాలయ ఉద్యోగులను బదిలీ చేయగా కొన్ని చోట్ల ఖాళీలు ఉన్నాయి. నిత్యం ఆధార్ అప్‌డేట్‌కు సచివాలయాల్లోనూ అవకాశం కల్పించాలి.
–మేఘనాథరెడ్డి, కడతట్లపల్లె

విజయవంతం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న అశోక్

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీల విషయంలో క్రిమిలేయర్ విధానానికి నిరసనగా ఈనెల 23న పలమనేరులో సభ నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పలమనేరు జెండా మఠం ప్రైవేట్ కమ్యూనిటీ హాల్ నందు మాలమహానాడు సభ జరుగుతుందని ఈ సభకు నియోజకవర్గంలోని విద్యార్థులు, మేధావులు అందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈసందర్భంగా మాలమహానాడు పోస్టర్లను విడుదల చేశారు. సంఘ నేతలు శ్రీనివాసులు, నాగరాజ, శంకర, భాస్కర్, రెడ్డి, నాగ, మంజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 11 ఫిర్యాదులు

పుంగనూరు: ఆర్టీసీ సేవల్లోని సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకరయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో కొత్తగా మూడు బస్సు సర్వీసులు, చార్జీల్లో వ్యత్యాసం, సర్వీసుల్లో మార్పు, ప్రతి ఒక్క ఆర్టీసీ బస్సు బస్టాండులోనకి రావాలని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు.